ఇక.. హాయిగా ప్రయాణం

ఎన్పీకుంట: ఆ గ్రామాలకు దశాబ్దాలుగా రోడ్డు సౌకర్యం లేదు. టీడీపీ హయాంలో ప్రజా ప్రతినిధులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. కానీ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆ పల్లెవాసుల కోరిక నెరవేరింది. ఇకపై ఇబ్బందుల్లేకుండా హాయిగా ప్రయాణం చేయవచ్చంటూ హర్షం వ్యక్తం చేశారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మేకలచెరువు పంచాయతీ ప్రజలకు ఇచ్చిన హామీని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి నెరవేర్చారు. మేకలచెరువు పంచాయతీలోని గంగెద్దులవారిపల్లి, పెడకంటి వారిపల్లి గ్రామాలకు దశాబ్దాలుగా రహదారి సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే వారు. 'గడపగడపకు' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పర్యటించిన సమయంలో రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరారు. సుమారు రూ.35 లక్షల ఎన్ఆర్జీఈఎస్ నిధులతో పాటు రూ.16.50 లక్షల గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా విడుదలైన నిధులతో మల్లమీదపల్లి ప్రధాన రహదారి నుంచి గంగెద్దులవారిపల్లి మీదుగా తిమ్మమ్మమర్రి మాను ప్రధాన రహదారి వరకు, పెడకంటివారి పల్లి గ్రామాలకు సీసీ రోడ్లు ఏర్పాటు చేశారు. సీసీ రోడ్లను సోమవారం నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి బీటీ, సీసీ రోడ్లు ఏర్పాటు చేశామన్నారు. గతంలో 104, 108 వాహనాలు వెళ్లడానికి కూడా వీలు లేని మారుమూల పల్లెలకు సైతం చక్కటి రహదారులు నిర్మించామని తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గ వ్యాప్తంగా సంవత్సరాల తరబడి రహదారి సౌకర్యం లేని సుమారు 135 గ్రామాలకు పైగా రహదారి సౌకర్యం కల్పించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. టీడీపీ హయాంలో అధికారం అడ్డుపెట్టుకొని ప్రజల సొమ్మును దోచుకొని గ్రామాల అభివృద్ధిని విస్మరించారన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక ఎల్లో మీడియా జగనన్నపై బురదజల్లే కార్యక్రమం చేస్తోందని మండిపడ్డారు. ప్రతిపక్షాల కుట్రల్ని ప్రజలే తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.జగనన్నకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈటెరాము, మండల కన్వీనర్, ఎంపీటీసీ సభ్యుడు కొత్తరంగారెడ్డి, స్థానిక సర్పంచ్ సరిత, ఎంపీటీసీ తిమ్మారెడ్డి, సర్పంచులు నాగమునీశ్వరనాయుడు, విష్ణుమూర్తి, ఉప సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆదినారాయణరెడ్డి, కన్వీనర్లు రమణారెడ్డి, శ్రీరాములు, సాంబ, డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ పురుషోత్తంరెడ్డి, బీసీసెల్ కన్వీనర్ ఆదెప్పనాయుడు, వాటర్‌షెడ్ చైర్మన్ బయారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాఘవయ్య, స్థానిక నాయకులు హరిప్రసాద్‌రెడ్డి, కేశవ, వి.సిద్దారెడ్డి, రంగారెడ్డి, ప్రకాష్, గోవిందునాయక్, ఈశ్వర్‌నాయక్, అల్లాబక్షు, గోవిందురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం

కదిరి టౌన్: పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపట్టారని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎన్జీవో కాలనీ వార్డు సచివాలయం పరిధిలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సిద్దారెడ్డి హాజరై మాట్లాడారు. జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీ పరిధిలోకి అనేక జబ్బులను చేర్చారని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, కౌన్సిలర్లు రంగారెడ్డి, రాంప్రసాద్, కృపాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు జిలాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి

ధర్మవరం అర్బన్: ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించామని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి తెలిపారు. పట్టణంలోని గాంధీనగర్, గీతానగర్ సచివాలయాల పరిధిలో సోమవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి మాట్లాడుతూ రెండు సచివాలయాల పరిధిలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య స్థితిగతులను పర్యవేక్షించామని తెలిపారు. 174 మందికి కంటి పరీక్షలను కంటి వైద్యాధికారి ఉరుకుందప్ప ద్వారా పరీక్షలు చేయించి వారిలో 32 మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఉషారాణి, కేతా లోకేష్, కొత్తపేట వార్డు ఇన్‌చార్జ్ చాంద్‌బాషా, కాలంగి శ్రీనివాసులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గడువులోగా సమస్యలు పరిష్కరించాలి

బత్తలపల్లి: ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అందే అర్జీలను గడువులోగా పరిష్కారం చూపాలని తహసీల్దార్ యుగేశ్వరిదేవి పేర్కొన్నారు. స్పందన కార్యక్రమాన్ని సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంతో పాటు అన్ని గ్రామ సచివాలయాల్లో నిర్వహించారు. ఇందులో తమకు రేషన్ బియ్యం అందడం లేదని పలువురు మహిళలు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఏపీఓ ఆదెప్ప, ఏపీఎం సుదర్శన్‌రాజు, ఇంజనీర్ రమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మి, ఏఓ ఓబిరెడ్డి, పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ శివయ్య, ఇతర అధికారులు హాజరయ్యారు.

అంకితభావంతో పని చేయాలి

- డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి
- గ్రామ వలంటీర్లతో సమావేశం



మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి

తాడిమర్రి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం గ్రామ వలంటీర్లు అంకిత భావంతో పని చేయాలని డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన స్థానిక స్వగృహంలో గ్రామ కార్యదర్శులు రిజ్వానా బేగం, ప్రమీల, సచివాలయాల కన్వీనర్ అల్లే సాయినాథ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజినేయులుతో కలసి గ్రామ వలంటీర్ల సమావేశం నిర్వహించారు. సంక్షేమ పథకాలను సవ్యంగా ప్రజలకు చేరవేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేశారన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడానికి, ప్రజలకు అందించడానికి వలంటీర్లు వారధిగా పని చేయాలన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూనే మరోపక్క ప్రభుత్వం నిర్వహించే ముఖ్యమంత్రి కార్యక్రమాలు, మహాసభలకు ప్రజలను తరలించాల్సిన బాధ్యత ఉందన్నారు. అధిక సంఖ్యలో ప్రజలు కార్యక్రమాలకు వచ్చి జయప్రదం చేసేలా కృషి చేయాలన్నారు. రానున్న 5 నెలలు ఎంతో కీలకం కావడంతో కష్టపడి పని చేయాల్సి ఉంటుందని ఆయన వలంటీర్లకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బండారు పెద్ద ఓబిలేసు, మారక శివారెడ్డి, సిద్దే రామకృష్ణారెడ్డి, బీసాని లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుల ఆందోళన

తనకల్లు: మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని కోరుతూ సీపీఐ నాయకులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. సీపీఐ కన్వీనర్ రెడ్డెప్ప మాట్లాడుతూ తీవ్ర వర్షాభావం కారణంగా పంటలను సాగు చేసిన రైతులు నష్టపోయారన్నారు. ప్రభుత్వం తనకల్లు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ వితరణ



గౌతమికి ల్యాప్‌టాప్ అందిస్తున్న కేతిరెడ్డి సుప్రియ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని 7వ వార్డుకు చెందిన నీలూరి గౌతమికి ఎమ్మెల్యే కేతిరెడ్డి సతీమణి కేతిరెడ్డి సుప్రియ నూతన ల్యాప్‌టాప్‌ను ఉచితంగా అందించారు. బీటెక్ మూడో సంవత్సరం సీఎస్ఈ గ్రూప్‌లో తన చదువుకు ల్యాప్‌టాప్ అవసరమని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని విద్యార్థి కోరింది. ఈ క్రమంలో సోమవారం ఎమ్మెల్యే నివాసంలో సుప్రియ అందజేశారు. బాగా చదివి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

అలరించిన హరికథ



హరికథ వినిపిస్తున్న రమ్యశ్రీ

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో సోమవారం నిర్వహించిన హరికథ కార్యక్రమం అలరించింది. ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు రమ్యశ్రీ హరికథ ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, పాలక మండలి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ దంపతులకు ఆత్మీయ వీడ్కోలు



వైద్యాధికారులకు వీడ్కోలు పలుకుతున్న సిబ్బంది

తలుపుల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యసేవలు అందించి, ఉన్నత చదువులకు వెళ్తున్న వైద్యాధికారి దంపతులు డాక్టర్ మున్వర్‌బాషా, డాక్టర్ సల్మాకు సోమవారం వైద్య సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు పలికారు. స్థానిక ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ డాక్టర్ దంపతుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ రఫినాయక్, సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జ్ డీకేబాబు, ఎంపీడీఓ కిరణ్ మోహన్‌రావు, ఈఓపీఆర్డీ శకుంతల, సర్పంచ్ షేక్షావలి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం: ముదిగల్లుకి చెందిన బోయ ధనుంజయ సోమవారం పురుగుల మందు తాగాడు. ఇంట్లో భార్యతో గొడవపడిన ఆయన మనస్తాపంతో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.



టీడీపీ నాయకుడి ఇంట్లో మద్యం లభ్యం

గుమ్మఘట్ట: మండలంలోని నేత్రపల్లిలో మద్యం విక్రయిస్తున్న టీడీపీ నాయకుడు సెబ్ పోలీసులకు దొరికిపోయాడు. టీడీపీ నాయకుడు (8వ వార్డు మెంబర్ భర్త) తిప్పేరుద్ర ఇంట్లో సెబ్ పోలీసులకు దాడులు నిర్వహించి 288 కర్ణాటక టెట్రా మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, అతడి పై ఎక్సైజ్ కేసు నమోదు చేశారు. అలాగే గొల్లపల్లి గ్రామం వద్ద రాయదుర్గం పట్టణానికి చెందిన నాగరాజు నుంచి 48 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు సెబ్ సీఐ జయనాథ్‌రెడ్డి తెలిపారు.

మహానంది వసతి గృహాన్ని కేటాయించాలి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ కళాశాలల్లో పీజీ చదువుతున్న విద్యార్థులకు మహానంది వసతి గృహాన్ని కేటాయించాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు జార్జ్ రెడ్డి, మహేష్, కార్తీక్, రాజేశ్, హరీష్, శంకర్, పవన్, మధుసూదన్ కోరారు. ఈ మేరకు వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందించారు. మహానందిలో ఉన్న విద్యార్థులను గంగ వసతి గృహానికి కేటాయించాలని అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. భవనం శిథిలావస్థలో ఉన్న నేపథ్యంలో మహానంది వసతి గృహంలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పైపుల విషయంలో గొడవ

కళ్యాణదుర్గం: ఇద్దరు రైతుల మధ్య పైపుల విషయంలో గొడవ జరిగింది. ఈ ఘటన కళ్యాణదుర్గం మండలంలోని తిమ్మసముద్రం గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... గ్రామానికి చెందిన వెట్టి ఓబిలేశు అదే గ్రామానికి చెందిన మరో రైతు ఆంజనేయులుకు చెందిన స్ప్రింకర్ పైపులను అడిగి పంట అయిపోగానే తెస్తానని ఒప్పించి తీసుకెళ్లాడు. అయితే పంట పూర్తికాగానే వెట్టి ఓబిలేశు వద్ద ఉన్న పైపులను ఆంజనేయులు చెప్పాడని అదే గ్రామానికి చెందిన మరో రైతు ఈడిగ చంద్రప్ప తీసుకెళ్లాడు. ఏడాది తర్వాత ఆంజనేయులు వెట్టి ఓబిలేశు వద్దకు వచ్చి పైపులు ఇవ్వాలని కోరగా నీ పేరు చెప్పి చంద్రప్ప తీసుకెళ్లాడని సమాధానమిచ్చాడు. తనకు తెలియకుండా ఎలా ఇస్తావని, తనకు పైపులు కావాలని నిలదీశాడు. దీంతో చంద్రప్ప వద్దకు వెళ్లి ఓబిలేశు పైపులు అడగగా పైపులు లేవు..ఏం లేవు అంటూ దబాయించాడు. చేసేదేమీలేక ఓబిలేశు ఆంజనేయులుకు కొత్త పైపులు కొనుగోలు చేసిచ్చాడు. అనంతరం ఆదివారం రాత్రి చంద్రప్ప వద్దకు వెళ్లి పైపులు తానే ఇప్పించానని...కనీసం పైపుల ఖర్చు అయినా ఇవ్వాలని కోరగా చంద్రప్ప కుమారులు ఈడిగ మణెప్ప, ఈడిగ చైతులు తదితరులు ఓబిలేశుపై దాడికి దిగారు. గాయపడిన అతడిని కుటుంబ సభ్యులు కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





సామాజిక ఇంజనీర్లుగా ఖ్యాతి గడించాలి


జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ

అనంతపురం: విద్యార్థులు సామాజిక ఇంజనీర్లుగా ఖ్యాతి గడించాలని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగజనార్దన అన్నారు. సోమవారం జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో సీనియర్ విద్యార్థులు, జూనియర్ విద్యార్థులకు స్వాగత కార్యక్రమం (ఫ్రెషర్స్ డే) నిర్వహించారు. కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జూనియర్లు, సీనియర్లు అనే తారతమ్యం లేకుండా అందరూ కలిసికట్టుగా చదువుతూ ఉండడం గర్వకారణమన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం మీద అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. విశిష్ట అతిథిగా హాజరైన పి. శంకర నారాయణ (1970 బ్యాచ్ పూర్వ విద్యార్థి) మాట్లాడుతూ భవిష్యత్‌లో విద్యార్థులు ఉద్యోగాలను కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా ఇంజినీరింగ్ విద్యార్థులు సివిల్ సర్వీసెస్‌పై దృష్టి సారించాలన్నారు. రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్ మాట్లాడుతూ నాలుగేళ్లు కష్టపడి చదివితే, పదికాలాల పాటు ఉన్నత స్థానంలో ఉంటారని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. విజయకుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, స్పోర్ట్స్ సెక్రటరీ బి. జోజిరెడ్డి , డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ. కేశవ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అరుణ కాంతి, ప్రొఫెసర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


నారాయణ స్వామి (ఫైల్)

యాడికి: మిద్దె పైనుంచి జారి పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని ఓబుళాపురంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ గురు ప్రసాద్ రెడ్డి, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రైతు నారాయణ స్వామి (57 ఆదివారం సాయంత్రం వర్షం కురుస్తుండటంతో నిచ్చెన ఎక్కి గవాక్షి మూత వేశాడు. కిందికి దిగుతున్న క్రమంలో కిందపడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతడ్ని చికిత్స నిమిత్తం అనంతపురం తరలించగా.. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ గురు ప్రసాద్‌రెడ్డి తెలిపారు.





క్లుప్తంగా

అనాథ శవానికి అంత్యక్రియలు



అనాథ శవాన్ని అంత్యక్రియలకు తరలిస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన అనాథ శవానికి ముస్లిం నగరా టిప్పుసుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షులు ఉమర్‌ఫరూక్ ఆధ్వర్యంలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. సేవా మందిరం వద్ద భిక్షాటన చేసే యాచకుడు అనారోగ్యంతో మృతి చెందగా, ఆయనకు ఎవరూ లేకపోవడంతో ఎస్‌ఐ నరేంద్ర, ఏఎస్‌ఐ ఇదాయితుల్లా సమక్షంలో పంచనామా నిర్వహించారు. విషయం తెలుసుకున్న ముస్లిం నగరా టిప్పుసుల్తాన్ యూనైటెడ్ ఫ్రంట్ సభ్యులు హిందూపురం జనరల్ కోవిడ్ శ్మశాన వాటిక దగ్గర మృతదేహానికి సోమవారం అంత్యక్రియలు పూర్తి చేశారు.

ఎన్నికల పరిశీలకుడిగా ఎమ్మెల్యే వెంకటేశ్



పావగడ: తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఆ రాష్ట్రానికి చెందిన అచ్చంపేట్ (ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడిగా స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్‌ను ఏఐసీసీ నియమించింది. ఉత్తర్వులు అందుకున్న వెంటనే అచ్చంపేట నియోజక వర్గానికి వెళ్లాలని పేర్కొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



జ్యోతులు మోస్తున్న మహిళలు

పావగడ: తాలూకాలోని మీనకుంటపల్లి గ్రామంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి విగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం వాల్మీకి చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు. మహిళలు జ్యోతులు మోశారు. స్థానిక తాలూకా మదకరి నాయక సంఘం అధ్యక్షుడు ఓంకారనాయక, జయప్ప, విజయకుమార్, జయసింహ, రాజగోపాల్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరుకు వెళ్లి పింఛన్ అందజేత



నరసప్పకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ వినోద్‌కుమార్

గుడిబండ: మండలంలోని గుడ్డదహళ్లికి చెందిన నరసప్ప అనారోగ్యంతో బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో వైద్య చికిత్సల కోసం చేరారు. విషయం తెలుసుకున్న వలంటీర్ వినోద్‌కుమార్ సోమవారం తన స్వంత ఖర్చుతో బెంగళూరుకు వెళ్లి పింఛన్ మొత్తం రూ.2,750 అందజేశారు. సుమారు 143 కిలోమీటర్ల దూరం నుంచి వచ్చి పింఛన్ అందించిన వినోద్‌కుమార్‌కు బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.

తాడిపత్రిలో కంపు రాజకీయం

- అండర్ డ్రెయినేజీ పనుల వద్ద జేసీ ప్రభాకర్ హంగామా
- పనులు అడ్డుకునేందుకు మున్సిపల్ చైర్మన్ యత్నం
- పోలీసుల రంగప్రవేశంతో జారుకున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచరులు



రెండో వార్డులో పనులను అడ్డుకుంటున్న చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, అనుచరులు

తాడిపత్రి అర్బన్: మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి టీడీపీ ఉనికి కోసం 'కంపు రాజకీయం' చేయడం ప్రజల్లో జుగుప్సను కలిగించింది. తాడిపత్రి పట్టణంలోని కెనరా బ్యాంక్ ముందున్న సీబీ రోడ్డులో అండర్ డ్రెయినేజీ వ్యవస్థ దెబ్బతిని మ్యాన్‌హోల్ నుంచి లీకైన మురుగు బయటకు వచ్చి నిలిచిపోయింది. ఇంకా పలు చోట్ల ఇదే పరిస్థితి తలెత్తింది. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, పాలక వర్గ సభ్యులు తమకేమీ పట్టనట్టుగా ఉండిపోయారు. ప్రజలు పడుతున్న ఇబ్బందుల గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి డ్రెయినేజీ నీరు సాఫీగా వెళ్లేలా చూడాలని ఇటీవల మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పారిశుధ్య కార్మికులు సీబీ రోడ్డులోని మ్యాన్‌హోల్ వద్ద మరమ్మతు పనులు చేస్తున్నారు. అయితే ఈ క్రెడిట్ అధికార పార్టీకి వెళ్తుందని భావించిన జేసీ ప్రభాకర్‌రెడ్డి టీడీపీ ఉనికి కాపాడుకునేందుకు సోమవారం కౌన్సిలర్లతో కలిసి ఆందోళనకు దిగారు. కెనరా బ్యాంక్ ఎదురుగా రోడ్డుపై నిలిచిన మురుగునీటిలో కుర్చీ వేసుకుని కూర్చున్నాడు. సహచర కౌన్సిలర్ మల్లికార్జునను మురుగులో పొర్లించాడు. తాను చేసిన ఆందోళన వల్లే అధికారులు స్పందించి పనులు చేస్తున్నారన్న సంకేతాలను ప్రజల్లోకి పంపే యత్నం చేశారు. 'కంపు' రాజకీయం గురించి తెలుసుకున్న చింతల వెంకటరమణస్వామి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు వేలూరి మురళీప్రసాద్‌రెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీ శ్రేణులు అక్కడకు చేరుకుని జేసీ ప్రభాకర్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మున్సిపల్ చైర్మన్ అయ్యుండి పనులు జరగకుండా అడ్డు తగలడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జేసీ డౌన్ డౌన్... జేసీ గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండటంతో డీఎస్పీ గంగయ్య, సీఐలు హమీద్‌ఖాన్, లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎస్‌ఐలు రామకృష్ణ, ధరణీబాబు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పట్టణ అభివృద్ధికి అడ్డు తగిలితే ఉపేక్షించేది లేదని డీఎస్పీ తనదైన శైలిలో హెచ్చరించి పంపించేశారు. అక్కడి నుంచి బయటకు వచ్చిన ప్రభాకర్‌రెడ్డి అనుచరగణం.. రెండో వార్డులో జామియా మసీదు వద్ద వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ ఫయాజ్‌బాషా చేయిస్తున్న అండర్ డ్రెయినేజీ పనుల వద్దకు చేరుకుంది. పనులు అలా కాదు ఇలా చేయాలంటూ ఏక వచన సంబోధనతో పాటు దురుసుగా మాట్లాడిన జేసీ ప్రభాకర్‌రెడ్డిపై ఫయాజ్‌బాషా ఆగ్రహించారు. కౌన్సిల్ ప్రతిపక్ష పార్టీ నేతలకు మర్యాద ఇవ్వడం కూడా తెలీదా అని తిరగబడటంతో .. జేసీ ప్రభాకర్‌రెడ్డి అందరి సమక్షంలో 'క్షమాపణ' చెప్పాడు. సమాచారం అందుకున్న సీఐలు హమీద్ ఖాన్, లక్ష్మీకాంత్‌రెడ్డి అక్కడకు చేరుకోగానే జేసీ అనుచరగణం చిన్నగా జారుకుంది.

ప్రభాకర్‌రెడ్డిపై కేసు నమోదు

ప్రజా జీవనానికి, రవాణాకు ఆటంకం కల్గించి 30 పోలీస్ యాక్టు ఉల్లంఘించడంతో పాటు అధికారుల విధులకు అడ్డు తగిలినందుకు టీడీపీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిపై అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. చైర్మన్‌తో పాటు 30 మంది టీడీపీ కౌన్సిలర్లపై 341, 188 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు.

పెనుకొండను జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

పెనుకొండ: పుట్టపర్తి జిల్లా కేంద్రాన్ని రద్దు చేసి పెనుకొండను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఏఓకు వినతిపత్రం అందించారు. ప్రభుత్వం జిల్లాలను మార్పు చేసే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో పెనుకొండను జిల్లా కేంద్రంగా ప్రకటిస్తే అన్ని విధాలుగా ఈ ప్రాంతం అభివృద్ధి సాధించడమేకాకుండా అన్ని ప్రాంతాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వివిధ సంఘాల నాయకులు రఫూప్, షమీవుల్లా, రామాంజినేయులు, నరసింహులు, నారాయణ, ఆదిశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు బస్సు ఢీ - వృద్ధురాలికి తీవ్రగాయాలు

గోరంట్ల: స్థానిక గ్రంథాలయం సమీపంలో కదిరి - హిందూపురం ప్రధాన రహదారిపై సోమవారం రోడ్డు దాటుతున్న ఓ వృద్ధురాలిని ప్రైవేటు బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. పోలీసుల వివరాల మేరకు కొండ్రెడ్డిపల్లికి చెందిన వృద్ధురాలు నారాయణమ్మ(60) వారపు సంతకు గోరంట్ల వచ్చిందన్నారు. సంత ముగించుకొని గ్రంథాలయం సమీపంలో రోడ్డు దాటుతుండగా ప్రైవేటు బస్సు ఢీకొంది. ప్రమాదంలో నారాయణమ్మ చేయి విరిగింది. చికిత్స నిమిత్తం 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సోమందేపల్లిలో భారీ వర్షం

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లపై వర్షపు నీరు ప్రవహించారు. వర్షం రాకతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. వాన కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జోరుగా వర్షం కురవడంతో జాతీయ రహదారిపై వాహన రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది.



సోమందేపల్లిలో వర్షం పడుతున్న దృశ్యం

సీఎం పర్యటన విజయవంతం చేయండి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

హిందూపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక పిలుపునిచ్చారు. జగనన్న పాలనలో వరుసగా ఐదో సంవత్సరం వైఎస్సార్ రైతు భరోసా - పీఎం కిసాన్ రెండో విడత నిధుల విడుదల కార్యక్రమం సందర్భంగా పుట్టపర్తిలో మంగళవారం భారీ బహిరంగ సభగా ఏర్పాటు చేశారన్నారు. ముఖ్యమంత్రి సభకు నియోజకవర్గంలోని హిందూపురం పట్టణ, మండలం, లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలిరావాలని కోరారు.



గుడిబండ: పుట్టపర్తిలో మంగళవారం జరగనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని వైఎస్సాసీపీ మండల కన్వీనర్ యంజారేగౌడ్, జేసీఎస్ కన్వీనర్ కొంకల్లు శివకుమార్, సింగల్‌విండో అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల నుంచి ప్రత్యేక వాహనాల ద్వారా ఉదయం 7 గంటలకు మండల కేంద్రం నుంచి బయలు దేరనున్నట్లు చెప్పారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో పాటు సచివాలయాల కన్వీనర్లు గృహసారథులు, వైఎస్ఆర్‌సీపీ పార్టీ శ్రేణులు, సభకు అత్యధికంగా తరలిరావాలని కోరారు.

మలేషియాలో నృత్యప్రదర్శన



మలేషియాలో పురం యువతుల నృత్యప్రదర్శన

హిందూపురం: మలేషియాలోని ఒటూకెవ్స్ సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం వద్ద ఆలయ నిర్వాహకులు నృత్య ప్రదర్శన నిర్వహించినట్లు హిందూపురం సాయి సంగీత నృత్య కళా నిలయం నిర్వహకులు డైరెక్టర్ వారిజానాథ్ తెలిపారు. హిందూ సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేస్తూ పలు దేశాల్లో ప్రదర్శనలు నిర్వహించామన్నారు. మలేషియాలో కూడా ప్రదర్శన నిర్వహించామని చెప్పారు. నృత్య ప్రదర్శనలో హిందూపురంకు చెందిన కుసుమా, ప్రజ్ఞారాధ్య, నాగవేణి, లాలస, వారిజానాథ్, లహరి హర్ష పాల్గొన్నారన్నారు.

కొత్త ట్రిబ్యునల్ రద్దు చేయాలి



పురందేశ్వరికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చిలమత్తూరు: జిల్లా పర్యటనకు వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని జలసాధన సమితి సభ్యులు మండలంలోని కొడికొండ చెక్‌పోస్ట్ దగ్గర సోమవారం కలిశారు. పోలవరం నుంచి కృష్ణా నదికి తరలించే అదనపు జలాలను తెలంగాణకు కూడా పంపిణీ చేయాలని కేంద్రం కొత్త ట్రిబ్యునల్‌కు విధివిధానాలను ప్రతిపాదిస్తూ గెజిట్ విడుదల చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. రాష్ట్రానికి అన్యాయం జరిగేలా ఆ నిర్ణయం ఉందన్నారు. కొత్త ట్రిబ్యునల్ రద్దు చేసేలా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతిపత్రాన్ని అందించారు. ఓపీడీఆర్ శ్రీనివాసులు, నాయకులు జమీల్, రవికుమార్, అబ్దుల్ తదతరులు పాల్గొన్నారు.

తెగిపడిన హైటెన్షన్ విద్యుత్ వైర్లు

పావగడ: తాలూకాలోని మరిదాసనహళ్లిలో సోమవారం ఉదయం 5 గంటల సమయంలో విద్యుత్ ప్రమాదం జరిగింది. గ్రామం మధ్యలో ఏర్పాటు చేసిన హైటెన్షన్ తీగ తెగిపడడంతో షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో ఆ ప్రాంతంలోని ఇళ్లలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. పలు ఇళ్లలోని విద్యుత్ కనెక్షన్లు, మీటర్లు, టీవీలు, వాషింగ్ మెషిన్లు, ఫ్యాన్లు, ఫ్రిడ్జ్ దగ్ధం కావడంతో రూ.లక్షలాది రూపాయల ఆస్తినష్టం జరిగింది. ఇళ్ల ముందు వేసుకున్న చప్పరాలు కాలిపోయి మంటలు చెలరేగాయి. స్థానికులు ఆందోళనకు గురై ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని ఇంటి బయటకు పరుగులు తీశారు. విద్యుత్‌శాఖ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని విద్యుత్ అధికారులను స్థానికులు డిమాండ్ చేశారు.

పోస్టర్ల ఆవిష్కరణ

మడకశిర: హైదరాబాద్‌లో ఈ నెల 11న మాదిగల విశ్వరూప మహాసభ జరగనుంది. ఆ సభకు సంబంధించిన పోస్టర్లను సోమవారం అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఎమ్మార్పీఎస్, డీహెచ్‌పీఎస్, ఎంఈఎఫ్ సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు బీసీఆర్ దాస్, స్థానిక నాయకులు హనుమంతు, నాగేంద్ర, నారాయణప్ప, ఈశ్వర్, కొల్లేష్, శివ,శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

దళితల గురించి మాట్లాడే అర్హత టీడీపీకి లేదు

రొళ్ల: దళితులుగా ఎవరైనా పుట్టాలి అని కోరుకొంటారా? అని హేళన చేసిన మాజీ సీఎం చంద్రబాబుకి, ఆ పార్టీ నాయకులకు దళితుల గురించి మాట్లాడే అర్హత లేదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ నాగేంద్ర హితవు పలికారు. సోమవారం వారు పట్టణంలో విలేకరులతో మాట్లాడరారు. టీడీపీ అధికారంలో ఉన్నన్నినాళ్లూ దళితులపై వివక్షత చూపి ప్రస్తుతం రాజకీయ స్వలాభం కోసం దళితుల పట్ల మొసలి కన్నీళ్లు కార్చడం ఎంత వరకు సమంజసమని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులకు అన్ని విధాలా అండగా ఉన్నారన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని స్కూటరిస్టు మృతి



మృతి చెందిన మహబూబ్ బాషా

అనంతపురం క్రైం: స్థానిక కలెక్టరేట్ ఎదుట సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టు మృతి చెందాడు. ట్రాఫిక్ సీఐ వెంకటేశ్ నాయక్ తెలిపిన మేరకు.. కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై హిందూపురం ఆర్టీసీ డిపో బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొని, సుమారు వంద మీటర్ల దూరం ఈడ్చుకెళ్లింది. ద్విచక్రవాహనం బస్సు చక్రాలకింద ఇరుక్కుపోయింది. ఈ ప్రమాదంలో వినాయక్ నగర్‌కు చెందిన మహబూబ్ బాషా (24), సయ్యద్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు స్పందించి వీరిని 108 వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా, అక్కడ చికిత్స ప్రారంభిస్తుండగానే మహబూబ్ బాషా మృతి చెందాడు. సయ్యద్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదానికి దారితీసిన కారణాలపై ట్రాఫిక్ పోలీసులు విచారిస్తున్నారు. కలెక్టర్ కార్యాలయం ముందు మూడు చోట్ల మలుపులు ఉండడంతో ప్రమాదాలు కూడా అదే స్థాయిలో జరుగుతున్నాయని స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తామని ట్రాఫిక్ సీఐ వెంకటేష్ నాయక్ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 'చిట్టి'



చిట్టితో ఉపాధ్యాయులు

పెనుకొండ రూరల్: మండలంలోని మావటూరు హైస్కూల్‌కి చెందిన 9వ తరగతి విద్యార్థిని బి.చిట్టి రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికై నట్లు ప్రదానోపాధ్యాయురాలు శ్రీలత తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో నిర్వహించిన పోటీల్లో చిట్టి ప్రతిభ చూపిందన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

స్థూపం నిర్మాణం ప్రారంభం

లేపాక్షి: మండలంలోని కంచిసముద్రం పరిధిలోని ఐదుకళ్లు సదాశివానగర్ కాలనీలో సీపీఐ స్థూపం నిర్మాణానికి ఆ పార్టీ నాయకులు సోమవారం భూమి పూజ చేశారు. సీపీఐ మండల కార్యదర్శి శివప్ప, నాయకులు నారాయణరెడ్డి, గౌతమ్‌కుమార్, గంగన్న, మారయ్య, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ రుణాలపై అవగాహన



రుణాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

అమరాపురం: స్థానిక సొసైటీ కార్యాలయంలో సోమవారం వివిధ రుణాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ సొసైటీ ద్వారా అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా సంఘాల సభ్యులు పొందిన రుణాలతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఇందుకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో సింగల్‌విండో అధ్యక్షుడు చిక్కన్న, డైరెక్టర్ నాగరాజు, సూపర్ వైజర్ కృష్ణానాయక్, కార్యదర్శి గురుమూర్తి, మందలపల్లి సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయండి



బంద్ పోస్టర్లను విడుదల చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

హిందూపురం టౌన్: విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణతోతో పాటు కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మాణం కోసం ఈ నెల 8న తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని సప్తగిరి కళాశాలలో విద్యాసంస్థల బంద్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ జాతీయ సమన్వయ కర్త సంపత్ కుమార్ మాట్లాడారు. అనేక పోరాటాలతో 32 మంది యువకుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసే చర్యలకు ఖండిస్తున్నామన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు కార్మికులు చేసిన ఆందోళన 8న 1000 రోజులకు చేరుకోవడంతో బంద్‌కు పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర విభజన హామీల్లో రాయలసీమ జిల్లాల్లో కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మిస్తామని హామీ ఇచ్చి అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. వెనుకబడి రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించలేదని మండిపడ్డారు. మన హక్కుల కోసం చేపట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు జయచంద్ర, నరసింహమూర్తి, తరణ్, దేవరాజ్, రాజా, దినేష్ రెడ్డి, వినీత్, మహేష్, సాయి, అనిల్, శ్రీనివాస్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ, కడపలో ఉక్కు పరిశ్రమ సాధనకు ఈ నెల 8న ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థ బంద్ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా పీడీఎస్‌యూ అధ్యక్షుడు ఉమేష్ నాయక్ తెలిపారు. పోస్టర్లను విడుదల చేసి విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు.

జోరుగా గోమాంసం అక్రమ రవాణా

- పోలీసులు హెచ్చరించినా వెనక్కి తగ్గని అక్రమార్కులు
- వివిధ మార్గాల్లో కర్ణాటక రాష్ట్రానికి తరలింపు
- లేపాక్షి పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంతో మరోసారి వెలుగులోకి..
- మొక్కజొన్న కంకుల మధ్యలో గోమాంసం తరలింపు

హిందూపురం అర్బన్: హిందూపురం పరిసర ప్రాంతాల నుంచి కర్ణాటక రాష్ట్రం బెంగళూరు మహానగరానికి జోరుగా గోమాంసం అక్రమంగా సరఫరా అవుతోంది. జిల్లా పోలీసులు ఇప్పటికే ఎన్నో విధాలుగా గోమాంసం తరలిపోకుండా చర్యలు చేపడుతున్నా... అక్రమార్కులు మాత్రం వివిధ పద్ధతుల్లో గోమాంసాన్ని జిల్లా దాటించేస్తున్నారు. గోవధ చట్టం అమలులో ఉన్నా పశువధ, వినియోగం, అక్రమ రవాణా ఆగడం లేదు. ముఖ్యంగా హిందూపురం నుంచి ప్రతిరోజూ పెద్ద ఎత్తున వివిధ వాహనాల్లో పోలీసుల కన్నుకప్పి అక్రమార్రులు గోమాంసాన్ని బెంగళూరుకు తరలిస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ 27న హిందూపురం నుంచి బెంగళూరుకు మూడు బొలెరో వాహనాల్లో గోమాంసాన్ని తరలిస్తుండగా భజరంగదళ్ నాయకులు అడ్డుకొని వాహనాలకు రోడ్డుపైనే నిప్పు పెట్టారు. గోవధ చేయమని అక్కడే ప్రమాణం చేయించారు. పట్టణంలో గోమాంసం విక్రయించే దుకాణాలను సైతం పోలీసులు, మున్సిపల్ అధికారులు అప్పట్లో సంయుక్తంగా మూయించారు. తరువాత వారం తిరక్కుండానే మళ్లీ తెరుచుకొన్నాయి.

రూటు మార్చి రవాణా

హిందూపురం నుంచి సోమవారం ఉదయం రూటు మార్చి లేపాక్షి మీదుగా బెంగళూరుకు గో మాంసాన్ని అక్రమార్కులు తరలిస్తుండగా లేపాక్షి వద్ద బొలెరో వాహనం ప్రమాదానికి గురైంది. దీంతో వాహనంలో గోమాంసం తరలిస్తున్న విషయం వెలుగు చూసింది. తమపై ఎక్కడ కేసు నమోదు చేస్తారోనని టెంపో డ్రైవర్ పరారయ్యాడు. హిందూపురం పట్టణ శివారులోని పరిగి రోడ్డులో ఏర్పాటు చేసుకున్న దుకాణాల్లో గోవధ చేసి మాంసాన్ని బెంగళూరుకు నిత్యం రెండు మూడు బొలేరో వాహనాల్లో తరలిస్తున్నారని తెలిసింది. సోమవారం లేపాక్షి వద్ద ప్రమాదానికి గురైన బొలెరో వాహనంలో 1.2 టన్నుల వరకు గోమాసం ఉన్నట్లు గుర్తించారు.



గోమాంసం తరలిస్తూ ప్రమాదానికి గురైన బొలెరో

నెలకు 80 టన్నులు

గోరంట్ల సంతలో కొనుగోలు చేసే పశువులను హిందూపురం శివారు ప్రాంతానికి తీసుకువచ్చి రోజూ 15-20 పశువులు వధిస్తూ వాటి మాంసాన్ని రూటు మార్చి బెంగళూరుకు తరలిస్తున్నారని చెబుతున్నారు. నెలకు 80 టన్నుల వరకు రవాణా జరుగుతోందని అంటున్నారు.



బయటపడిన గోమాంసం

బొలెరో- టిప్పర్ ఢీ

లేపాక్షి: లేపాక్షి పరిధిలోని గలిబిపల్లి క్రాస్ వద్ద ఉన్న జాతీయ రహదారిపై సోమవారం బొలెరో వాహనం టిప్పర్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో బొలెరో నుంచి అక్రమంగా తరలిస్తున్న గోమాంసం బయట పడింది. ఎస్‌ఐ గోపి వివరాలమేరకు... లేపాక్షి గ్రామానికి చెందిన షేక్ బాబా టిప్పర్‌ను లేపాక్షి నుంచి హిందూపురంకు తీసుకెళ్తున్నాడు. అయితే గలిబిపల్లి క్రాస్ మలుపు వద్ద వెళుతున్న టిప్పర్‌ను వెనుక వైపు నుంచి అతి వేగంగా వస్తున్న బొలెరో ఢీకొంది. రెండు వాహనాలు బోల్తా పడడంతో బొలెరోలో నుంచి గోమాంసం బయట పడిందన్నారు. గోమాంసాన్ని గుర్తించకుండా ఉండేందుకు వాహనంలో కింద పైనా మొక్కజొన్న కంకులు వేసుకుని మధ్యలో గోమాంసం తరలిస్తున్నారని చెప్పారు. రెండు వాహనాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించగా బొలెరో డ్రైవర్ పరారయ్యాడు. అయితే టిప్పర్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

చట్టం ప్రకారం చర్యలు

పట్టణంలోని శివారు ప్రాంతాల్లో అనుమతులు లేకుండా గోవులను చంపి బెంగళూరుకు తరలించడంతో పాటు పట్టణంలో మాంసం విక్రయిస్తున్న వారిపై ఇప్పటికే కేసులు నమోదు చేశాం. మున్సిపల్ కమిషనర్‌కు సమాచారం కూడా అందించాం. తరచూ సంయుక్తంగా దాడులు చేస్తూనే ఉన్నాం. చట్టం ప్రకారం చర్యలు తప్పవు.

– కంజాక్షన్, డీఎస్పీ, హిందూపురం

క్లుప్తంగా

రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థికసాయం



నగదు అందిస్తున్న నాయకులు

ఎన్‌పీకుంట: మేకలచెరువు గ్రామం హరిజనవాడకు చెందిన జి.ఆంజినేయులు గత రెండు వారాల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్దనే వైద్యసేవలు అందుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి సోమవారం స్థానిక సర్పంచ్ సరిత, నాయకులతో కలిసి బాధితుడి ఇంటికి చేరుకొని పరామర్శించి, తన కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. అధైర్యపడొద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ రాము, మండల కన్వీనర్ కొత్తరంగారెడ్డి, స్థానిక నాయకులు హరిప్రసాద్‌రెడ్డి, ప్రకాష్, సిద్దారెడ్డి తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయురాలి మృతి



కృష్ణవేణి (ఫైల్)

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో నివాసం ఉంటున్న ఉపాధ్యాయురాలు కృష్ణవేణి ఆదివారం అర్ధరాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. కృష్ణవేణి కొజ్జేపల్లి యూపీ పాఠశాలలో సోషల్ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించేవారు. అయితే కొన్ని రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యారు. ఆదివారం రాత్రి ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో మృతి చెందారు. కృష్ణవేణి మృతిపై వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాసరెడ్డి, పట్టణ కన్వీనర్ పీరా, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు సంతాపం ప్రకటించారు.

గొంతుకోసుకొని యువకుడి ఆత్మహత్యాయత్నం

అనంతపురం క్రైం: స్థానిక చంద్రబాబు నాయుడు కొట్టాలకు చెందిన లక్ష్మన్న అనే యువకుడు బ్లేడుతో గొంతుకోసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన సోమవారం వెలుగుచూసింది. లక్ష్మన్న చాలా కాలంగా బొప్పాయి కూలీల మేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పెళ్లి చేసుకోవాలని తల్లి ఒత్తిడి తెస్తుండడంతో మానసికంగా ఇబ్బంది పడుతున్న అతను.. సోమవారం తెల్లవారుజామున బ్లేడుతో గొంతుకోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తరలించారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నంద్యాల జిల్లా నందికొట్కూరుకు చెందిన అమ్ములు, ముత్తు కుటుంబ సభ్యులతో కలసి పామిడికి ఆటోలో బయలుదేరారు. అయితే కొత్తపేట గ్రామ శివారుకు చేరుకోగానే వేగంగా వెళ్తున్న ఆటోకు కుక్క అడ్డుగా రావడంతో డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో అమ్ములు, ముత్తు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు కర్నూలు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని నంద్యాల రోడ్డులో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు. మద్యం విక్రయిస్తున్న కల్లూరు ఖాజామోదీన్ అలియాస్ దాదు, షేక్ మస్తాన్‌వలి, సలీం, హనీఫ్ అనే ముగ్గురుని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. వారి నుంచి రూ.21,700 విలువ చేసే 432 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి అదృశ్యం

పెద్దవడుగూరు: మండల పరిధిలోని చిత్రచేడు గ్రామానికి చెందిన శ్రీనివాసులు అనే యువకుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం శ్రీనివాసులును తల్లి మందలించడంతో అతడు ఇంటి నుంచి వెళ్లిపోయాడని పేర్కొన్నారు. బంధువులు, తోటి మిత్రులను విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. యువకుడి తండ్రి రామాంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

సీఎం సభకు తరలిరండి

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపు
- ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో బిజీబిజీ
- వారం రోజులుగా పార్టీ శ్రేణులతో సమావేశాలు



పార్టీ శ్రేణులతో కలిసి ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

పుట్టపర్తి రూరల్: ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తొలిసారి పుట్టపర్తికి వస్తుండటం చాలా సంతోషంగా ఉందని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తెలిపారు. అన్నదాతల కోసం ఏర్పాటు చేసిన 'వైఎస్సార్ రైతు భరోసా' పథకం నగదు జమ చేసే కార్యక్రమాన్ని ఇక్కడి నుంచే ప్రారంభిస్తున్నందుకు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. సీఎం పర్యటనకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

విజయవంతానికి విశేష కృషి

జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తొలి పర్యటన విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం రైతు భరోసా నిధుల విడుదలకు సీఎం జగన్ విచ్చేస్తున్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీ, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులను సమన్వయం చేసుకొని ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి పర్యటన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు పాల్గొనేలా పార్టీ శ్రేణులు, రైతులను సన్నద్ధం చేశారు. 680 బస్సులు, సుమారు 2 వేలకుపైగా ఆటోలు, ఇతర వాహనాలను ఏర్పాటు చేశారు. తరలివచ్చే ప్రజలకు ఇబ్బంది లేకుండా 3 లక్షల వాటర్ పాకెట్లు, సీఎం జగన్, ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి ఫొటోలు కలిగిన 40 వేల వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు, కేకులు, స్నాక్స్‌లతో కూడిన బాక్సులు సమకూర్చారు.

వారం రోజులుగా బిజీబిజీ..

వారం రోజులుగా పుట్టపర్తి నియోజకవర్గంలోని 6 మండలాల్లోని స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే సమావేశాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

విజయవంతం చేద్దాం

కొత్తచెరువు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం పుట్టపర్తికి విచ్చేస్తున్న సందర్భంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నారేపల్లి జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీపీ గాయత్రి, జెడ్పీటీసీ సభ్యురాలు గంగాదేవి పిలుపునిచ్చారు. రైతు భరోసా, పీఎం కిసాన్ మొత్తాలను రైతుల ఖాతాల్లోకి జమ చేయనున్న సందర్భంగా పుట్టపర్తిలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సమీపంలో జరిగే బహిరంగ సభకు మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని వారు కోరారు.

తరలిరండి

అమడగూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సభను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులకు, కార్యకర్తలకు సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలం నుంచి దాదాపు 100 బస్సులలో కార్యకర్తలు తరలివచ్చి జయప్రదం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ భర్త, పుట్టపర్తి మున్సిపాలిటీ పార్టీ పరిశీలకుడు శివశంకర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జయప్రదం చేద్దాం

బత్తలపల్లి: పుట్టపర్తిలో జరగనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభను జయప్రదం చేద్దామని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కతమం ఈశ్వరయ్య, జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, వైస్ ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి తదితరులు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ పుట్టపర్తిలో సైతం రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నారన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామం నుంచి బస్సు..

కనగానపల్లి: జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో వైఎస్సార్ రైతు భరోసా పంపిణీ సభను జయప్రదం చేయాలని ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ కోరారు. మంగళవారం జరగనున్న భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతున్నారన్నారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్తున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి ప్రత్యేకంగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు..

నల్లమాడ: రైతు భరోసా సాయం విడుదల కోసం మంగళవారం (నేడు) పుట్టపర్తికి విచ్చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటన విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. జన సమీకరణ ఏర్పాట్లలో భాగంగా సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే పార్టీ నాయకులు, అధికారులతో చర్చించారు. సీఎం పర్యటనకు తరలివచ్చే కార్యకర్తలు, ప్రజలకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నాయకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఎంపీడీఓ కొండన్న, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు బీఆర్ కేశప్ప, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టీడీ కేశవరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పొరకల రమణ, కుళ్లాయినాయక్, అంజినాయక్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

కళ్యాణదుర్గం: మండలంలోని గరుడాపురం సమీపంలో సోమవారం సాయంత్రం బొలరో- బైకు ఢీ కొన్నాయి. పోలీసుల వివరాల మేరకు...కొత్తూరుకు చెందిన హరిజన రామాంజనేయులు తన ద్విచక్రవాహనంలో కళ్యాణదుర్గం వైపు నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. గరుడాపురం వద్దకు రాగానే ఎదురుగా వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేసి ముందుకెళ్లాడు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం బైకును ఢీ కొంది. ఘటనలో హరిజన రామాంజనేయులు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 వాహనంలో అతడిని కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అనంతపురం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువు పనులు ముమ్మరం



గంగిరెడ్డిపల్లి చెరువు గండిపడిన ప్రాంతంలో చేపట్టిన పనులు



గువ్వలగుట్టపల్లి చెరువు కాలువ పనులు చేస్తున్న దృశ్యం

- రూ.8 లక్షలతో మరమ్మతులు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

పుట్టపర్తి అర్బన్: వర్షం నీటిని ఒడిసి పట్టి, సాగుకు ఉపయోగ పడేలా పలు చెరువుల మరమ్మతు పనులు చేపట్టారు. పుట్టపర్తి మండలంలోని రెండు చెరువులకు వర్షం నీటి వృథాను అడ్డుకట్ట వేయడానికి ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సహకారంతో నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మండలంలోని గంగిరెడ్డిపల్లి చెరువు కట్ట సుమారు రెండేళ్ల క్రితం గండి పడింది. అప్పటి నుంచి తాత్కాలిక మరమ్మతులు చేసి నీటిని నిలిపారు. ఈ చెరువు కింద గంగిరెడ్డిపల్లి, దిగువచెర్లోపల్లి గ్రామాలకు చెందిన సుమారు 120 ఎకరాల సాగు భూమి ఉంది. కాలువల ద్వారా పంటలకు నీటిని వదులుతారు. గండి పడిన ప్రాంతంలో శిథిలాలను తొలగించి తూములు ఏర్పాటు చేసిన చోట కాంక్రీట్ పనులు పూర్తి చేశారు. మట్టి నింపే కార్యక్రమం పూర్తయితే చెరువు కట్ట పటిష్టంగా మారుతుంది. దీనికి రూ.4 లక్షలు ఖర్చు చేస్తున్నారు. కట్టపై రాకపోకలు సాగిస్తే అభయాంజనేయస్వామి ఆలయానికి సులభంగా చేరుకోవచ్చు.

రైతుల హర్షం..

చెరువుతో పాటు గువ్వలగుట్టపల్లి చెరువుకు వెళ్లే సప్లై చానల్ తెగిపోయి చిత్రావతి నుంచి చెరువుకు నీళ్లు వెళ్లేవి కావు. ఇటీవల సుమారు రూ.4 లక్షలు మంజూరు చేయడంతో చానల్ కట్టను పటిష్టం చేశారు. చిత్రావతికి ఇది లింకు కాలువగా సుమారు మూడు కిలోమీటర్లకు పైగా ఉంది. ఇందులో వంద మీటర్లకు పైగా తెగిపోవడంతో కట్టను పటిష్ట పరిచారు. దీంతో ఆయా గ్రామాల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రెండు పనులు పూర్తయితే సుమారు 208 ఎకరాల భూమికి సమృద్ధిగా నీరు అందుతాయి. ఈ క్రమంలో స్థానిక రైతులు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నారు.

రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులు



విద్యార్థినులతో ప్రిన్సిపాల్ వెంకటరామానాయుడు



రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల హెచ్‌ఎం, పీడీ

ముదిగుబ్బ: రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ముదిగుబ్బ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, పీడీ రేఖలు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఇటీవల బుక్కపట్నం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17, 19 విభాగాల్లో జిల్లా స్థాయి షూటింగ్ బాల్ పోటీలు జరిగాయన్నారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముదిగుబ్బ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు జి.తీర్థ, పి.యజ్ఞశ్రీలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ గేమ్స్ సెక్రటరీ సుగుణబాయి తెలిపారు. విద్యార్థినులను ప్రధానోపాధ్యాయురాలు, పీడీ, ఉపాధ్యాయిని బృందం అభినందించారు.

కదిరి విద్యార్థులు..

కదిరి అర్బన్: రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు కదిరి మండల పరిధిలోని గట్లవద్ద ఉన్న కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(గర్ల్స్) ఇంటర్ చదివే విద్యార్థినులు కే పావని, ప్రియాంకలు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరామానాయుడు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాల పీడీ అశ్వినీ, వార్డెన్ బాలాజీ నాయక్ తదితరులు వారిని అభినందించారు.

ఖోఖో పోటీలకు నలుగురు ఎంపిక

కనగానపల్లి: కనగానపల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు నలుగురు ఏపీ స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పీడీ రమేష్ తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో జరిగిన స్కూల్ గేమ్స్ జిల్లా స్థాయిలో జరిగిన ఖోఖో పోటీల్లో కనగానపల్లి విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో వైష్ణవి, అర్చన, ఎర్రిస్వామి, నాగచైతన్య అత్యంత ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలు నవంబర్ 9 నుంచి 12 వరకు చిత్తూరులో నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, పీడీని హెచ్‌ఎం లక్ష్మిదేవి, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

ఆధ్యాత్మికతతో మనసుకు ప్రశాంతత

- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

అనంతపురం/కల్చరల్: శాస్త్ర విజ్ఞానం సమ్మిళితమైన ఆధ్యాత్మికతతోనే మనసుకు ప్రశాంతత లభిస్తుందని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. పురాణ ఇతిహాసాలు, శాస్త్రాలపై మూఢ నమ్మకాలు అనే అపోహ ఉందని, అది ఎంత మాత్రం సరికాదన్నారు. దైవంపై ఉన్న భక్తివిశ్వాసాలు మనపై మనకు నమ్మకం పెంచే సాధనాలుగా చూడాలన్నారు. అసమాన ప్రవచన చక్రవర్తి, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ధర్మవర్దిని ట్రస్టు ఆధ్వర్యంలో జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో గోమాత, తల్లి విశిష్టతలపై రెండురోజుల పాటు ప్రవచనాలు చెప్పారు. అనంతరం ఆయన సోమవారం 'సాక్షి'తో ప్రత్యేకంగా ముచ్చటించారు.

మాది సాధారణ కుటుంబం..

మాది ఏలూరు. అక్కడే నా బాల్యం, చదువు సాగింది. నాన్న సుందర శివరావు, అమ్మ సుశీలమ్మ హైందవ ధార్మిక జీవితం గడిపేవారు. మా కుటుంబ నేపథ్యంలో ఎవరూ ప్రవచన కర్తలు లేరు. అమ్మానాన్నల సాధారణ జీవిత విధానమే మాలోనూ భాగమైపోయింది. వారి బోధనలు నన్ను ఆధ్యాత్మికత వైపు నడిపించాయి. నాన్న శంకరశతకం రచించారు. అమ్మ సుశీలమ్మ కూడా ఎంతో మందికి మంచి విషయాలు బోధించిన వ్యక్తి. బహుశా ఆ ప్రేరణ నాలోనూ ఉండొచ్చు. అలవోకగా వేల సంఖ్యలో పద్యాల ధారణ ఎలా సాధ్యమని అందరూ అడుగుతుంటారు. కానీ నేనేమీ ప్రత్యేకంగా సాధన చేయడం లేదు. భగవంతుడిపై ఉన్న అచంచల భక్తి విశ్వాసాలు ఉన్న ఎవరికైనా ఇదంతా సాధ్యమనడంలో సందేహం లేదు. అమ్మానాన్నల ప్రేరణే ఇరవై ఏళ్లుగా ప్రవచనాలు చేయడానికి దోహదపడింది. సాధారణంగా ఏ గృహిణి అయినా, వ్యక్తులైనా ఆడంబరాలు కోరుకుంటారు. కానీ అదృష్టవశాత్తూ నా సతీమణి సుబ్రహ్మణ్యేశ్వరికి సాధారణ జీవితం ఇష్టం. వ్యవసాయశాఖలో ఉద్యోగం చేసి, ఉద్యోగ విరమణ పొందింది. ఉన్నంతలో జీవితం గడపడం ఆమెకు ఇష్టం. నేను కూడా ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో మేనేజర్ స్థాయిలో ఉద్యోగ విరమణ చేశాను. మా కొడుకు షణ్ముఖ చరణ్, కూతురు నాగశ్రీవల్లి ఇద్దరూ ఇంజినీర్లుగా చేస్తున్నారు.